# పుస్తకం హస్తభూషణం

నేను మొన్న ఆఫీసు పని మీద జర్మనీ వెడుతూ ఎయిర్‌పోర్ట్‌లో చెకిన్ అయాక ఇంకా టైముంటే, ఎయిర్‌పోర్ట్‌లో అలవాటు ప్రకారం ఈ మూలనించీ ఆ మూలకి రెండుమూడుసార్లు చకచకా నడక సాగించాను. స్టుట్‌గార్ట్‌కి పది గంటల ప్రయాణం మరి. అన్ని గంటలు విమానంలో కూర్చోబోయే ముందర కాస్త కాళ్ళు సాగుతాయని. వెనక్కి తిరిగి మా గేటు దగ్గరికి వస్తుంటే, ఎదురుగా కనపడింది ఒక బుక్ షాపు. అక్కడేదో సైకాలజీ మీద ఒక పుస్తకం కనబడితే, అటూ ఇటూ పేజీలు తిప్పాను. విషయం కొంచెం సరదాగా అనిపించితే ఆ పుస్తకం కొన్నాను. అక్కడ డబ్బులు పే చేయటానికి ఒక పెద్ద లైను. దాదాపు పది పదిహేనుమంది లైన్‌లో నాకన్నా ముందర వున్నారు. ఇంకో పదిమంది కొనటానికి పుస్తకాలు చేతుల్లోకి తీసుకుంటున్నారు రాక్స్ దగ్గర. అప్పుడే నా ఆలోచనలు తెరిచిన పుస్తకంలో గాలికి ఎగురుతున్న పేజీలలా నా మనసులోకి వచ్చాయి.

నేను త్రివేండ్రంలో పనిచేసేటప్పుడు ప్రతి ప్రయాణంలోనూ రైల్వే స్టేషన్‌లో నాలుగైదు తెలుగు నవలలు కథల పుస్తకాలూ పత్రికలూ కొనేవాడిని. కేరళ చేరేదాకా చదువుకోటానికీ తర్వాత దాచుకుని నా లైబ్రరీలో వుంచుకోవటానికీ బాగుండేవి. ఆ రోజుల్లో ఎమ్మెస్ రావుగారి ఎమెస్కో పుస్తకాలు ఒక్కొక్కటీ రెండు రూపాయలు. (అప్పుడు సీనియర్ మేనేజర్ల జీతాలు కూడా రెండు వేల లోపలే వుండేవనుకోండి) అప్పుడే ఒక విచిత్రమైన విషయం గుర్తించాను.

నేను గుంటూరులో కొన్న పుస్తకాలు, ట్రైన్ ఒంగోలు దాటే లోపలే నా పర్మిషన్ లేకుండానే నడిచి మా పెట్టెలోనే కాక పక్క పెట్టెల్లోకి కూడా వెళ్ళిపోయేవి. కొన్ని అయితే అక్కడక్కడా స్టేషన్లలో దిగి ఆ పుస్తకాలు 'దొంగిలించిన వారి' ఇళ్ళకి వెళ్ళేవి. అందుకే కొన్న పుస్తకాలని వెంటనే సూట్‌కేస్‌లో పెట్టేసుకుని, ఏదో ఒక మేగజైన్ మాత్రం దారిలో చదువుకోటానికి బయట పెట్టుకునేవాడిని. లేకపోతే నేను కొనుక్కున్న పుస్తకాలు ఇంకొకరి హస్త భూషణాలయేవి మరి.

ఆరోజుల్లోనే 'మలయాళ మనోరమ' అనబడే మలయాళ దిన పత్రిక, ఇండియా మొత్తం మీద ఎక్కువ కాపీలు అమ్ముడుపోతున్న వార్తాపత్రిక. జాతీయ దినపత్రికలయిన హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్ ఆఫ్ ఇండియాలు దేశంలో ఎక్కువగా అమ్ముడుపోయే పేపర్లు అనుకునేవాడిని. కానీ కేరళ వెళ్ళిన తర్వాతే అర్థమయింది మలయాళ మనోరమ ఎందుకంత సర్క్యులేషన్‌లో వుందో. ఆ రోజుల్లోనే అంటే 1970వ దశకంలోనే నూటికి నూరుపాళ్ళ సరస్వతీ నిలయమయింది

కేరళ. దేశంలోనే ప్రప్రథమంగా ఆ గొప్పతనాన్ని సాధించిన ఒకే ఒక రాష్ట్రం. మా పనమ్మాయి పొద్దున్నే, మా ఇంట్లో పని పూర్తి చేసుకుని, హైస్కూలు చదువుకి వెళ్ళేది. అదీకాక ప్రజలలో పుస్తకాలూ పత్రికలూ చదివే అలవాటు విపరీతం. ఎవరి చేతిలో చూసినా పుస్తకం లేదా పేపరు నిజంగా హస్త భూషణమే. పుస్తకాలు చదివే అలవాటు వల్లే కాబోలు, ఆ ప్రోత్సాహంతో మలయాళంలో ఎంతో గొప్ప సాహిత్యం వచ్చింది.

తెలుగు పుస్తకాలు చదవటమంటే నాకు ప్రాణం. నేను ఇండియాకి వచ్చినప్పుడల్లా, తిరిగి వచ్చేటప్పుడు ఒక సూట్‌కేస్ నిండా వుండేవి అవే. ఇక్కడ నా లైబ్రరీలో కూడా పుస్తకాలు ఒకరకం స్నేహితులు వచ్చినప్పుడల్లా బయటికి నడిచి పోతుండేవి. ఇప్పుడు ఒకటే రూలు. పుస్తకాలు చదువుకుంటానంటే నాకేమీ అభ్యంతరం లేదు కానీ మా ఇంట్లోనే ఏ శెలవు రోజో వచ్చి చదువుకోండి, కావాలంటే కాఫీ మిరప కాయ బజ్జీలు కూడా ఇస్తాను అని ముందే చెబుతాను.

ఇది వ్రాస్తుంటే ఎప్పుడో విన్న జోకు ఒకటి గుర్తుకొస్తున్నది. ఒక పుస్తకాభిమాని జార్జి బెర్నాడ్ షా ఇంటికి వెళ్ళాడుట. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు అతను గమనించిందేమిటంటే నేల మీద ఎక్కడ చూసినా మంచి మంచి పుస్తకాలు పడివున్నాయిట. అతను ఆ గదిలోకి వెళ్ళటానికే ఎన్నో పుస్తకాలని తొక్కకుండా జాగ్రత్తగా వెళ్ళవలసి వచ్చిందిట. అప్పుడతను తన అభిమాన రచయితని అడిగాడుట -ఇన్ని విలువైన పుస్తకాలని ఇలా నేల మీద పారేశారు, మంచి పుస్తకాల అలమరలను కొని వాటిలో పెట్టవచ్చుకదా అని. ఆయన నవ్వుతూ జవాబిచ్చాడుట - భలేవారండీ మీరు. మిత్రులు పుస్తకాలని అరువిస్తారు కానీ, అలమరలని ఇవ్వరు కదా అని. ఎంతవారలైనా సరస్వతీదేవి అరువుకి దాసులే అనుకోవాలేమో.

ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే మనలో పుస్తకాలు కొని చదివే అలవాటు బాగా తగ్గిపోయిందని. మిగతా భాషల్లోనూ దేశాల్లోనూ పుస్తకాల అమ్మకాలు పెరుగుతుంటే, మన తెలుగులో ఇంతకు ముందుకన్నా ఇప్పుడు బాగా తగ్గిపోయింది. అసలు పుస్తకాలు చదవటమే మనలో తక్కువ. అప్పనంగా దొరికితే కొంతమంది అయినా చదువు తారేమో కానీ, కొని చదవాలంటే అది మన తెలుగు సంస్కృతిలో లేదు. ఇక వస్తుందని అనుకోను. హోటల్‌కి వెళ్ళినప్పుడూ సినిమాలకి వెళ్ళినప్పుడూ కొన్ని వందలు ఖర్చు పెడతారు కానీ, పది రూపాయలు పెట్టి ఒక పత్రికని కానీ, యాభై రూపాయలు పెట్టి ఒక నవలని కాని కొనే ఆర్థిక స్థోమత మనవాళ్ళకి లేదు మరి!

బహుశా ఈ కారణాల వల్లే కాబోలు మన రచయితలు తమ రచనల మీద జీవనోపాధి చేయలేకపోతున్నారు. తమలో వున్న సాహిత్య తపనతో రచనలు చేసినా, వేరే ఉద్యోగాలు చేసుకుంటే తప్ప బ్రతకలేని పరిస్థితిలో, సినిమాల్లోకి వెడితే తప్ప డబ్బు గడించలేని దుస్థితిలో వున్నారు రచయితలు. ఒకటి రెండేళ్ళయిందేమో, ఇంటర్నెట్లో చదివిన ఒక వార్త నన్ను విపరీతంగా కదిలించింది. మరో మొహెంజోదారో

లాటి గొప్ప నాటికనూ ఎన్నో చక్కటి నవలలనూ వ్రాసిన ఎన్.ఆర్. నంది దుర్భర దారిద్ర్యంలో మరణించారనీ, అంత్యక్రియలకి కూడా ధనసహాయం లేదనీ. ఆయన తన చివరి రోజులలో, ఆ వృద్ధాప్యంలో పాల సీసాలు అమ్ముకుంటూ అనారోగ్యంతో మరణించారుట. నాకు చేతనయిందేదో నేను పంపించి, ఇంటర్నెట్లో సాహిత్యం మీద అన్నీ తమకే తెలిసినట్టు వాదించుకునే పెద్దలకి యధాశక్తి ధన సహాయం చేయమని ఒక విన్నపం కూడా చేశాను. వారు గొప్ప రచయితలు దిక్కులేకుండా చచ్చిపోతున్నా లెఖ్ఖ చేయక, మన తెలుగు సాహిత్యాన్ని తమ ఊకదంపుడు రచ్చబండ చర్చలతో బ్రతికిస్తూ బిజీగా వున్నారు కనుక వారినని ప్రయోజనం లేదు.

ఎయిర్‌పోర్ట్ బుక్‌స్టాల్లో పుస్తకం కొనుక్కుని వస్తూ చూశాను. ఎన్నో రకాల పుస్తకాలు. ఒక విషయం మీద కాదు.

ఎంతోమంది పుస్తకాలు కొంటునే వున్నారు. ప్రతి వారం బెస్ట్ సెల్లర్స్ లిస్టు వస్తుంది పేపర్లో. ఏ పుస్తకం ఎన్ని కాపీలు అమ్ముడుపోతున్నదో కూడా వ్రాస్తారు. రచయితలు రచయితలుగానే బ్రతుకు తెరువు ఎంచుకున్నవారు ఎందరో. కొందరు మిలియనీర్లు అయితే మిగతావారు జీవనోపాధికి ఏ ఇబ్బందీ లేకుండా, చక్కటి రచనలు చేస్తూనే వున్నారు.

ఎందుకు మనకీ వీళ్ళకీ ఈ తేడా? ఎక్కడనించీ వచ్చింది?

ఎనిమిది కోట్ల తెలుగువాళ్ళు, కనీసం వేయి కాపీలు మాత్రమే ప్రచురిస్తున్న ప్రముఖుల పుస్తకాలని ఆదరించలేక పోతున్నారంటే ఎంతో బాధగా వుంటుంది.

నేను గుంటూరు వెళ్ళినప్పుడల్లా, నవోదయా విశాలాంధ్రా పుస్తకాల షాపులకి వెళ్ళటం తప్పనిసరి. మంచి పాత పుస్తకాలు వున్నాయా అని అడిగేవాడిని. 'లేదు సార్. పుస్తకాల అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. ఎవరూ మళ్ళీ కొత్త ఎడిషన్లు వేయటంలేదు' అనే జవాబు వస్తుంది.

ఇక్కడ మన తెలుగువాళ్ళ ఇళ్ళకి వెళ్ళినప్పుడల్లా నేను పరిశీలించేది ఒకటి వున్నది. వాళ్ళ లివింగ్ రూములో లేదా ఫామిలీ రూములో ఏమయినా తెలుగు పుస్తకాలు కనపడతాయా అని.

నూటికి ఎనభైపాళ్ళు ఏ పుస్తకాలూ కనపడవు. నూటికి తొంభై తొమ్మిది పాళ్ళు అసలు తెలుగు పుస్తకాలు కనపడవు.

గమ్మత్తేమిటంటే ఏ ఇంటి కేగినా ఎందు కాలిడినా కనపడేవి ఎక్కువగా హిందీ సినిమా విడియోలూ, కొంచెం తక్కువగా తెలుగు సినిమా విడియోలూ!

పుస్తకం హస్త భూషణమేమో కానీ, తెలుగు పుస్తకం మాత్రం కాదు.

ప్రవృత్తి రీత్యానే కాక వృత్తి రీత్యాకూడా రచయితలూ, సంపాదకులూ, ప్రచురణకర్తలూ నిలబడినప్పుడే నిజంగా తెలుగు పుస్తకం కూడా హస్తభూషణం అయినట్టు. అంతవరకూ మనం వేచివుండాలేమో!

0 0 0